ప్రజాశక్తి

గురువారం 19 డిసెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నదుల అనుసంధాన పనులు ప్రారంభించాలి

అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల డిమాండ్ - పలు అంశాలపై తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సాగునీటి ప్రాజెక్టుల ద్వారానే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాలు స్పష్టం చేశాయి. ఈ మేరకు పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం అఖిలపక్ష రైతు, కార్మిక, ప్రజా సంఘాల సమావేశం జరిగింది. నాయకులు మాట్లాడుతూ కృష్ణా - గోదావరి - పెన్నా నదుల అనుసంధానం ప్రాజెక్టు, హరిశ్చంద్రాపురం నుండి నకరికల్లు వద్ద ఎత్తిపోతల పథకం పనులు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాలకు సాగు, తాగు నీరు అంది ఆయా ప్రాంతాలు సస్యశ్యామలంగా మారి అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం తీర్మానాలను ఆమోదించారు. ప్రాజెక్టు కింద నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, సంబంధిత శాఖ అధికారులకు ఎంపీ ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతి పత్రాలు ఇవ్వడం, ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న 4 జిల్లాల రైతులతో సదస్సులు

▶ 2లో

చూసేవారేరి..?

- పిహెచ్‌సిలపై కొరవడిన పర్యవేక్షణ - పగటి పూట సేవలకే పరిమితం
- రాత్రి వేళ వైద్యులు ఉండని పరిస్థితి - ప్రభుత్వం మారినా మారని విధానాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలపై పర్యవేక్షణ కొరవడింది. రోగులకు తగిన చికిత్సలు అందిచేందుకు రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన పట్టణ ఆరోగ్య కేంద్రాలను సరిగా పనిచేయకపోవడం వల్ల సాధారణ సమస్యలకు కూడా ప్రజలు గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారని ఇటీవల పలువురు అధికారులు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిలో మౌలిక సదుపాయాలు పెంచాలని, కొన్ని సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులు మంత్రికి వివరించారు. కానీ గత రెండు నెలల కాలంలో పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పరిస్థితి మెరుగుపడలేదు.

గుంటూరు, పల్నాడు జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాయంత్రం నాలుగు గంటల వరకే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. రాత్రి వేళ వైద్య సేవలు ఉండటం లేదు. కేవలం ఇద్దరు స్టాఫ్ నర్సులున్నా వారికి ఉన్న భద్రతా సమస్యలు కారణంగా రాత్రి వేళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు తెరవడం లేదు. ఏదైనా అత్యవసర చికిత్సలకు వెళితే సమీపంలోని పట్టణానికి లేదా గుంటూరు, నర్సరావుపేటలకు వెళ్లాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. మొత్తం ముగ్గురు స్టాఫ్ నర్సులు 24 గంటల వైద్యచికిత్సల కోసం నియమించినా రాత్రి వేళ భద్రత లేక స్టాఫ్ నర్సులు ఉండటం లేదు. రాత్రి వేళ డ్యూటీలో ఉన్న వారు పిహెచ్‌సిలలో ఉండకుండా సంబంధిత గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని డ్యూటీ చేస్తున్నారు. అక్కడ కూడా చికిత్సలు నిర్వహించకుండా కేవలం వైద్య సలహాలు అందించి మందులు ఇచ్చి అత్యవసరం అయితే వెంటనే సమీపంలోని పట్టణానికి లేదా జనరల్ ఆస్పత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో స్థానికంగా వైద్యులు అందుబాటులో ఉంటే ప్రథమ చికిత్స చేయిస్తున్నారు. సాయంత్రం 4

▶ 2లో



పెనుగొండ లక్ష్మీనారాయణకు పురస్కారంపై హర్షం



ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ కవి, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కటం అభినందనీయమని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ ట్రస్టీ పాశం రామారావు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రతిబింబిస్తూ లక్ష్మీనారాయణ రచనలు చేశారన్నారు. పేదల సమస్యలు, వాటి పరిష్కారాలపై తన రచనల్లో చర్చిస్తారని, అభ్యుదయ భావజాలాన్ని పెంచేందుకు కృషి చేస్తారని తెలిపారు. లక్ష్మీనారాయణకు అవార్డు రావటం అభ్యుదయ శక్తులకు ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు.



వడ్డేశ్వరంలో విద్యుత్ బిల్లుల దహనం

ప్రజాగ్రహం

3





ఆస్పత్రిలో సత్యనారాయణ మృతదేహం

ఆక్సిజన్ మాస్కు లేక...!

- ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వ్యక్తి మృతి
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న వ్యక్తిని తీసుకురాగ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుని భార్య మహేశ్వరి, కుమార్తె అఖిల కథనం ప్రకారం.... పట్టణంలోని 13వ వార్డుకు చెందిన మహంకాళి సత్యనారాయణ (47) కెసిపి సిమెంట్ ఫ్యాక్టరీలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తు ఇటీవల ఉద్యోగం మానుకున్నారు. బుధవారం మధ్యాహ్నం ఆరోగ్యం సరిగా లేకపోవటంతో ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి అక్కడ ఆక్సిజన్ సదుపాయం లేకపోవటంతో ప్రభుత్వ వైద్యశాలకు సత్యనారాయణ భార్య, పిల్లలతో కలిసి వెళ్లారు. ఆ సమయంలో డాక్టరు భోజనానికి వెళ్లటం వలన స్టాఫ్ నర్స్‌లు మాత్రమే ఉన్నారు. మా నాన ఆయాస పడుతున్నాడు కాస్తా చూడండి అని సిబ్బందిని అఖిల బతిమాలగా... డాక్టరు వచ్చిన తరువాత చూస్తారు అంటు సిబ్బంది సమాధానం ఇచ్చారు. కొంత సమయం వేచిఉండగా మరోవైపు సత్యనారాయణ పరిస్థితి విషమిస్తుండటంతో కుటుంబీకులు సిబ్బందిని మళ్లీ బతిమాలారు. ఆక్సిజన్ పెట్టేందుకు మాస్క్ లేదని, బయటకు వెళ్ళి తీసుకురావాలని చెప్పారు. తెచ్చేలోగా సత్యనారాయణ చనిపోయారు. దీంతో వైద్యులు, సిబ్బందితో మృతుని కుటుంబీకులు వాదనకు దిగారు. మృతదేహం పట్ల కూడా సిబ్బంది వైఖరి సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం

▶ 2లో

కుడి కాల్వలో విద్యార్థి గల్లంతు

▶ 2లో

తనిఖీలకు అధికారులు.. మూతబడ్డ దుకాణాలు..

ప్రజాశక్తి - కారంపూడి

తనిఖీలకు వస్తున్నారనే సమాచారం అందితే చాలు కిరాణా, ఫర్టిలైజర్స్, బంగారపు షాపుల యజమానులు హడలెత్తిపోతున్నారు. పక్క మండలంలో తనిఖీలు చేస్తున్నారని సమాచారం వచ్చినా ఇక్కడ దుకాణాలను మూసి వేస్తారు. బుధవారం కారంపూడిలో తూనికలు కొలతల అధికారులు రేషన్ షాపుల కాటాలను తనిఖీ చేస్తున్నారు. మరోపక్క ఇన్‌కం టాక్స్ అధికారులు వచ్చారనే సమాచారంతో వ్యాపారస్తులు తమ షాపులను మూసివేశారు. అయితే కారంపూడిలో తనిఖీలు చేపట్టింది ఎవరు అనేది అర్థం తెలియలేదు. గాంధీ బొమ్మ సెంటర్లోని ఓ షాపులో ఇన్కమ్ టాక్స్ అధికారులు సోదాలు చేస్తున్నారని సమాచారం రావడంతో అక్కడకు వెళ్లిన విలేకరులకు ఇన్కమ్ టాక్స్ అధికారులం కాదని తెలిపారు.

కారంపూడిలో నకిలీ వ్యాపారానికి అడ్డగా మారింది. చోరీ జరిగిన బంగారం కొనుగోలు చేయటం, కల్తీ నూనె, రికార్డు లేకుండా అక్రమ వడ్డీ వ్యాపారం, నకిలీ పురుగు మందులు, వంటివి చేస్తున్నారు. అధికారులు వస్తున్నారని చిన్నపాటి సమాచారం అందితే చాలు వ్యాపారస్తులు జాగ్రత్తలు పాటిస్తున్నారు. వారు వెళ్లిన తర్వాత తమ వ్యాపార దందాను యథావిధిగా కొనసాగిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇటీవల కాకినాడ జిల్లా పెద్దాపురంలోని ఓ రైస్ మిల్లులో ప్రముఖ కంపెనీకి కారంపూడికి చెందిన ఓ బ్రోకర్ ఆఫీస్ నుండి సుమారు 400 లారీలకు దాన్యం నాణ్యత లేకుండా తరలి వెళ్లినట్లు సమాచారంతో పెద్దాపురం రైస్ మిల్లు పై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్రముఖ రైస్ మిల్లు యాజమాన్యం బ్రోకర్ ఆఫీస్‌లో రికార్డులు పరిశీలించగా నాణ్యత లేని దాన్యం వచ్చినట్లు గుర్తించి నష్టపరిహారంగా రూ.3.50 లక్షలు తీసుకువెళ్లినట్లు విశ్వసనీయ సమాచారం.



ఇదిలా ఉండగా మండల కేంద్రమైన కారంపూడి ఎస్ఎస్సీ కాలనీలో రేషన్ షాపుల కాటాలను తూనికలు కొలతల అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ప్రతి సంవత్సరం కాటాలను తనిఖీ చేసి వ్యత్యాసం లేకుండా మరమ్మతులు చేస్తారు. మండలంలోని రేషన్ డీలర్లు కాటాలను తీసుకొని వచ్చి వ్యత్యాసాలను సరి చేస్తారు. కార్యక్రమంలో సత్తెనపల్లికి చెందిన తునికలు కొలతల ఇన్‌స్పెక్టర్ షేక్ జాన్‌సైదా, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటిన పులిపాడుకు సిఎం రాక

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు జనవరి ఒకటిన గురజాల మండలం పులిపాడుకు రానున్నారు. స్థానిక పంచాయతీ వద్ద సామాజిక పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొననున్నారు. పింఛన్ల పంపిణీ సభ అనంతరం సిఎం చంద్రబాబు అదేరోజు దైద బిలాన్ని సందర్శించనున్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లను పల్నాడు జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గురువారం పరిశీలించనున్నారు.

కుడి కాల్వలో విద్యార్థి గల్లంతు

ప్రజాశక్తి- మాచర్ల

సాగర్ కుడి కాల్వలో విద్యార్థి గల్లంతైన సంఘటన బుధవారం మాచర్ల సమీపంలోని బొంబాయి కంపెనీ వద్ద చోటుచేసుకుంది. రెంటచింతల మండలం జెట్టిపాలేనికి చెందిన తాటిమల్ల మరియబాబు బంధువులు మచర్ల పట్టణంలోని లింగాపురం కాలనీలో నివసిస్తున్నారు. వారిని చూడ్డానికని మరియబాబు కుమారుడైన తొమ్మిదో తరగతి విద్యార్థి కోటేశ్వరరావు (15) లింగాపురం కాలనీ వచ్చాడు. బుధవారం ఉదయం సాగర్ కుడి కాల్వలో స్నానం చేసేందుకు దిగగా ఈత రాకపోవడంతో నీటి ఉధృతికి గల్లంతయ్యాడు. వెళ్లిన పిల్లవాడు ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబీకులు కాల్వ దగ్గరకు వెళ్లగా స్థానికులు ద్వారా విషయం తెలిసింది. దీంతో వారు పోలీసులకు తెలపడంతో ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నదుల అనుసంధాన పనులు ప్రారంభించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించడం తదితర అంశాలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు ఉలవలపూడి రాము, ఏపూరి గోపాలరావు, రైతు సంఘం అధ్యక్షులు టి.బాబురావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు, కౌలురైతు సంఘం జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, సిఐటియు నాయకులు సిలార్ మసూద్, రైతుసంఘం నాయకులు సిహెచ్ సత్యనారాయణ రాజు, ఉప్పలపాటి రంగయ్య, అంజిరెడ్డి, నాగేశ్వరావు, ఎస్.కె చిన్నజాన్ సైదా, కోటేశ్వరావు, నరసింహారావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

చూసేవారేరి..?

(మొదటి పేజీ తరువాయి)

గంటల తరువాత వైద్యులు, ఇతర సిబ్బంది ఉండకపోవడం వల్ల కేవలం ఒక్క స్టాఫ్ నర్సు మాత్రమే ఉండాల్సివస్తుంది.

చాలా పిహెచ్‌సిలు ఊరికి దూరంగా ఉంటున్నాయి. రాత్రి వేళ జనసంచారం లేక ఆకతాయిలు, మందుబాబుల ఆగడాలతో స్టాఫ్ నర్సులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో చాలా మంది బిక్కుబిక్కు మంటూ ఉద్యోగాలు చేస్తున్నారు. రాత్రివేళ చాలా పిహెచ్‌సిలలో వైద్యులు లేక చికిత్సలు జరగడం లేదు. స్టాఫ్ నర్సు ఒక్కరే విధులు నిర్వహించలేకపోతున్నారని కనీసం రాత్రి వేళ వాచ్‌మెన్‌ను ఏర్పాటుచేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వాపోతున్నారు. గత ప్రభుత్వంలో వివిధ హోదాల్లో ఉన్న వేలాదిమంది సిబ్బందిని నియమించామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అవసరమైన సిబ్బంది లేక రోగులకే వారి సహాయకులతో ఆస్పత్రులకు వెళ్లి ఇబ్బంది పడుతున్నారు. పిహెచ్‌సిలపై పర్యవేక్షణ కూడా కొరవడింది. వీరి పనితీరును మెరుగుపర్చడం, కీలకమైన చికిత్సలు చేయకుండా రిఫర్ టు గుంటూరు, నర్సరావుపేట, తెనాలి అంటూ సరిపెడుతున్నారు.

ఆక్సిజన్ మాస్కు లేక...!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై డాక్టరు ఉథయబాను మాట్లాడుతూ అతని ఆరోగ్య పరిస్థితి పూర్తిగా బాగలేదని, తాము ప్రయత్నించినా ఫలితం లేకపోయిందని చెప్పారు. ఇటీవలలో కాన్పు కోసం వచ్చిన గిరిజన చెంచు మహిళ మృతి చెందిన సంఘటనలో కూడా సిబ్బంది నిర్లక్ష్యంపై బంధువులు ఆందోళన చేశారు. ఆ రోజు కూడా కాన్పు అయిన తరువాత గిరిజన మహిళకు ఇంజక్షన్‌తో కలిపిన సిలెన్ బాటిల్ పెట్టగా, కొద్ది సేపటికే ఆయాసం రావటం, వంటికి దురద రావటంతో పక్కనే ఉన్న తల్లి ఆందోళన చెందుతూ సిబ్బంది వద్దకు వెళ్లి విషయం తెలిపినా వారు సకాలంలో స్పందించకపోవటంతో మృతి చెందినదని, నాడు కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. మాచర్ల ప్రభుత్వ వైద్యశాల చుట్టు ప్రక్కల వంద గ్రామాలకు ప్రధాన ఆసుపత్రిగా ఉంది. గిరిజన తండాలు, మారు మూల ప్రాంతాలు అధికంగా ఉన్న ఈ ప్రాంత ప్రజలు ప్రభుత్వ వైద్యశాలనే ఆశ్రయిస్తుంటారు. ఇక్కడ ఉన్న సిబ్బంది కోరతో లేక నిర్లక్ష్యమోగాని పలుమార్లు దుర్ఘటనలు జరుగుతున్నాయి. రోగుల సంఖ్యకు తగ్గట్లు సిబ్బంది, సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హెల్త్‌కేర్ వృత్తిదార్లకు విస్తృత అవకాశాలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

అంతర్జాతీయ హెల్త్ కేర్ పరిశ్రమలో హెల్త్ కేర్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెషనల్స్ యొక్క అవకాశాలు - సవాళ్ల అనే అంశంపై ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ ఆధ్వర్యంలో ఒక్కరోజు వర్క్‌షాప్ బుధవారం జరిగింది. ఇన్‌ఛార్జి వీసీ కె.గంగాధరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అంతర్జాతీయ హెల్త్‌కేర్ పరిశ్రమలో హెల్త్ టూరిజం బాగా ప్రాచుర్యంలోకి వస్తుందన్నారు. ఈ పరిశ్రమను నిర్వహించే హెల్త్ కేర్ ప్రొఫెషనల్‌కు పరిశ్రమ యొక్క లోతైన అవగాహన, విషయ పరిజ్ఞానం గలవారై ఉండాలని సూచించారు. యాజమాన్యం, వైద్యులతో కలసి హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ విధులు నిర్వహించగలుగుతున్నారని, అనేక జఠిల సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించగలుగుతున్నారని పేర్కొన్నారు. కృత్రిమ మేధతో వైద్యరంగం వినూత్నమైన ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుందని తెలియజేశారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం మాట్లాడుతూ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ ఉద్యోగాలు సంపాదించడమే కాక వైద్య రంగంలో పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదగాలని అందుకు అనుకూలమైన పాఠ్యాంశాలను ఈ కోర్సులో పొందుపరచాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానం, భావవ్యక్తీకరణ, సమయపాలన, మానవీయ విలువలు వంటి మంచి లక్షణాలతో సమున్నత లక్ష్యాలను చేరుకోవచ్చని చెప్పారు. నేషనల్ హెల్త్ మిషన్ క్వాలిటీ ఇన్సూరెన్స్ రాష్ట్రస్థాయి సలహాదారు పసల జ్యోతి రిసోర్స్ పర్సన్‌గా మాట్లాడుతూ అంతర్జాతీయ వైద్య రంగంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నయని, భారతదేశానికి అంతర్జాతీయ రోగుల సంఖ్య రోజుకి గణనీయంగా పెరుగుతోందని అన్నారు. అందుకు అనుకూలంగా హాస్పటల్ అడ్మినిస్ట్రేటర్స్, ప్రొఫెషనల్స్ అన్ని విధాల



సంసిద్ధంగా ఉండాలని నైపుణ్యత కలిగిన అడ్మినిస్ట్రేటర్స్‌కు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ రంగం సవాలతో కూడినదని వాటినధిగమిస్తూ నాణ్యమైన వైద్య సేవలను రోగులకు అందించడంలో ఓ మంచి అవకాశం అని అన్నారు. ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ బట్టు నాగరాజు మాట్లాడుతూ 2005లోడిపార్ట్మెంట్ ప్రారంభించిన నాటి నుంచి 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో అధ్యాపకులు కీలక పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సాదిక్, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, డాక్టర్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో ట్రోఫీ అందుకున్న హార్దీ



ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక ఐతానగర్‌కు చెందిన అత్తోట హార్దీ డిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ అబాకస్ ఎ-2 లెవెల్ పోటీల్లో విజేతగా నిలిచి రెండు ట్రోఫీలు అందుకున్నాడు. డిసెంబరు 15న ఢిల్లీ యూనివర్సిటీ మల్టీపర్పస్ హాల్లో నిర్వహించిన యుసిఎంఎఎస్-2024 అంతర్జాతీయ, జాతీయ ఛాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని హార్దీ విజయకేతనం ఎగురవేసినట్లు తండ్రి అత్తోట ప్రమోద్ కుమార్ బుధవారం వివరాలు వెల్లడించారు. కొల్లూరు ఫోర్ ఫ్రంట్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న హార్దీ అమెరిక, ఆస్ట్రేలియా, కెనడా, ఘన, యుకె, శ్రీలంక లాంటి పెద్ద దేశాల క్రీడాకారులతో పోటీపడి కచ్చితమైన వేగం సమయపాలనతో సంక్లిష్టమైన అభాకస్ సమస్యలను పరిష్కరించి తన నైపుణ్యాన్ని చాటినట్లు యుసిఎంఎఎస్ సంస్థ సిఈఓ డాక్టర్ స్నేహాల్ కరియ తెలిపారు. చిన్నతనం నుండి కఠోర సాధన, పట్టుదల, గురువుల అద్భుత మద్దతుతో ప్రపంచ ప్రతిభావంతుల్లో ఒకడిగా నిలిచాడని కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వేదికపై తన పాఠశాల, తన ప్రాంతం ద్వారా ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని హార్దీ చెప్పాడు. హార్దీ విజయకేతనం ఎగురవేసిన హార్దీ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

పరిశోధకురాలి ఆరోపణలపై కమిటీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వ్యాయామ విద్య డైరెక్టర్ ప్రొఫెసర్ పిపిఎస్ పాల్ కుమార్ విజ్ఞప్తి మేరకు ఆయనపై పరిశోధకురాలు చేసిన ఆరోపణలపై నలుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించినట్లు ఇన్‌ఛార్జి వీసీ గంగాధరరావు తెలిపారు. ఈ కమిటీలో ఇన్చార్జి రెక్టర్ కె.రత్నషీలామణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం, ఇన్చార్జి ఓఎస్టీ ఆర్‌విఎస్ఎస్ఎన్ రవికుమార్, డాక్టర్ అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ వై.అశోక్ కుమార్‌ను నియమించినట్లు విసి పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : వ్యసనాలకు బానిసలై గంజాయి డ్రగ్స్ వంటి వాటికి అలవాటు పడితే చర్యలు తప్పవని వర్సిటీ విద్యార్థులను పెదకాకాని సిఐ నారాయణస్వామి హెచ్చరించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో బుధవారం ఆయన సమావేశమై ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి ఇతర డ్రగ్స్‌లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పిల్లలను పనిలో పెట్టుకుంటే దుకాణ యజమానులపై కేసులు నమోదు చేస్తామని సత్తెనపల్లి కార్మిక శాఖ అధికారి ధనలక్ష్మి హెచ్చరించారు. మానవ అక్రమ రవాణా యూనిట్, కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సత్తెనపల్లి పట్టణంలో పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేశారు. ఇద్దరు బాలకార్మికులను గుర్తించి, యజమానులపై కేసులు నమోదు చేశారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని బడికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో మానవ అక్రమ రవాణా యూనిట్ పోలీసులు అసిస్టెంట్ ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ ఎన్జీవో పవన్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఈనెల 10 న జిల్లా కేంద్రం గుంటూరు లోని గోరంట్ల నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ నందు జరిగిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పురుషుల స్విమ్మింగ్ కు జట్టు ఎంపికలు లో తమ కళాశాల విద్యార్థి ఎస్ జగదీష్ ప్రతిభ చాటి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు నరసరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంఎస్ సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైన జగదీష్ చెన్నైలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో జరగనున్న పోటీలకు పల్నాడు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా ప్రతిభ చాటి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపలవాయి విజయకుమార్ ,కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజయ్ కుమార్ సుబ్బరాయ గుప్తాలతో పాటు కళాశాల వైస్ ప్రెసిడెంట్ పెనుగొండ వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ వూటుకూరి వెంకట అప్పారావు, పాలకవర్గ సభ్యులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, వ్యాయామ అధ్యాపకులు యక్కల మధుసూదనరావు అభినందించారు.

రోడ్డు విస్తరణలో అవినీతిపై విచారణ : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎటి అగ్రహారం రోడ్ల విస్తరణలో అక్రమాలపై విచారణ చేయిస్తామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి హామీ ఇచ్చారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏటి అగ్రహారానికి చెందిన ప్రజలు ఎమ్మెల్యేను కలిసి రోడ్డు విస్తరణ పేరుతో గత వైసిపి ప్రభుత్వ నాయకులు, మునిసిపల్ అధికారులు అవినీతికి పాల్పడి ప్రజల నుండి పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని, దీనికి సాక్ష్యం మెయిన్ రోడ్డు అష్ట వంకరలు తిరగటమేనని, రాజకీయ కక్ష సాధింపులో భాగంగా తమ ఇళ్లకి అవసరం లేకపోయినా మార్కింగ్ వేశారని, అసలు ఈ రోడ్డుకు ఒక వైపు ప్రభుత్వ స్థలం ఉన్నా కూడా డబ్బుల కోసం దానిని వదిలేసి, విస్తరణ పేరుతో ఇళ్లని కూల్చారని ఫిర్యాదు చేశారు. దీనిపై గత వైసిపి ప్రభుత్వ నాయకులు, మునిసిపల్ అధికారుల అవినీతి మీద సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఇందుకు స్పందనగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతిపై విచారణ చేయిస్తానని హామీ ఇచ్చారు.



ప్రజాగ్రహం

పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని

సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం



నూతక్కిలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మండలంలోని నూతక్కి గ్రామంలో బుధవారం అధిక బిల్లుల విద్యుత్ బిల్లు లను నిరసిస్తూ బిల్లు ప్రతులను దగ్ధం చేశారు. బిల్లులో ట్రూఅప్ చార్జీలు సర్దుబాటు చార్జీలతో ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా నూతక్కి గ్రామంలోని కరెంటు బిల్లును దగ్ధం చేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు వల్లూరి భారతి రామచంద్ర రావు విజయలక్ష్మి సీతమ్మ చిన్నమ్మాయి బుజ్జి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని, సిపిఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చిన తర్వాత సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై అదనపు విద్యుత్ బారాలు వేయడానికి పూనుకుందని విమర్శించారు. అదానితో ఒప్పందం చేసుకున్న కారణంగా 2022, 2023 సంవత్సరంలో వాడిన విద్యుత్తు వాడకానికి ఇప్పుడు ట్రూ అప్, అదనపు చార్జీల పేరుతో ప్రజల నెత్తిన భారాలు వేయడం దుర్మార్గమైన చర్య అని ఆయన మండిపడ్డారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కష్ణ, సిపిఎం వడ్డేశ్వరం గ్రామ శాఖ కార్యదర్శి గుడిసె శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు కామినేని సాంబశివరావు, గుడిసె ప్రభు కుమార్, పున్నయ్య, ఎస్.కె పున్న తదితరులు పాల్గొన్నారు.



దుగ్గిరాలలో

ప్రజాశక్తి - దుగ్గిరాల

పెంచిన విద్యుత్ బిల్లు లు ఉపసంహరించుకోవాలని ఆదానితో ఒప్పందం రద్దు చేసుకోవాలని స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు అన్నారు. స్థానిక లూథరన్ చర్చి వద్ద బుధవారం విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జెట్టి బాలరాజు జి శ్రీనివాసరావు బ్రహ్మేశ్వర రావు బి చిరంజీవి భాస్కరరావు బుజ్జి సురేషు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ బుధవారం మంగళగిరిలో మూడు సెంటర్లలో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. నాలుగో వార్డు, మెట్ల వద్ద, ఆంజనేయ కాలనీలో జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం బాలాజీ, డి రామారావు, ఎల్ కోటేశ్వరరావు, కే వెంకటేశ్వరావు, ఎం నాగేశ్వరావు, కే వెంకటేశ్వరరావు, ఆర్ మురళీకష్ణ, లక్ష్మి, దుర్గ, సిహెచ్ నాగేశ్వరావు, జె నాగేశ్వరరావు, ఆర్ వేణు, జే బ్రాహ్మణి పాల్గొన్నారు.



మంగళగిరిలో



మంగళగిరిలో



కత్తిపోటుకు గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని రత్నాల చెరువులోని ఎస్టీ కాలనీ నాలుగో లైన్ లో మంగళవారం రాత్రి జరిగిన ఘటంలో కత్తిపోటు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుధవారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నాలుగో లైన్ లో మహిళ కొట్టు నడుపుకుంటూ ఉంది. జి శివ అనే వ్యక్తి ఆ మహిళ పట్ల వ్యవహరిస్తున్న తీరును అడ్డుకునేందుకు కే నాగాంజనేయులు వెళ్లారు. శివ కత్తితో నాగాంజనేయులు కడుపులో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నాగాంజనేయులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగాంజనేయులు పరిస్థితి విషమించి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని పట్టణ సీఐ డి వినోద్ కుమార్ పరిశీలించి, కేసు నమోదు చేశారు.

కాల్వలో దూకి ఆత్మహత్య

ప్రజాశక్తి-తాడేపల్లి

బకింగ్ హోమ్ కాల్వలో దూకి విజయవాడ కృష్ణలంకకు చెందిన తోట రామకోటేశ్వరరావు (55) ఆత్మహత్య చేసు కున్నాడు. మంగళవారం ఇంటి నుండి బయలుదేరి వచ్చిన రామ్ కోటేశ్వరరావు లోటస్ ఫుడ్ సిటీ దగ్గర పశ్చిమ డెల్టా హెడ్ స్లూయిస్ వద్ద బండి పార్కింగ్ చేసి కాలవలో దూకాడు. విషయం తెలిసిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. తాడేపల్లి పోలీసులు గాలించి మృతదేహాన్ని తాడేపల్లి రైలు బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి కనుగొన్నారు. చీకటి పడటంతో మృతదేహాన్ని బయటకు తీయడానికి సాధ్యపడలేదు. తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - దుర్గి

మండల పరిధిలోని ధర్మవరం గ్రామం దార్వేముల మధ్య ప్రధాన రహదారిపై రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సుధీర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ముందుగా అందిన సమాచారం మేరకు మంగళవారం అర్ధరాత్రి తర్వాత సిబ్బందితో వెళ్లి పట్టుకున్నామన్నారు. రేషన్ 20 క్వింటాళ్ల బియ్యాన్ని డిటిఒకు అప్పగించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని డ్రైవర్‌పై విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

వెన్నాదేవిలో చోరీ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంటిలో ఉన్న వెండి వస్తువులు నగదు అపహరించుకు పోయారు. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం వెన్నాదేవిలో బుధవారం వెలుగు చూచింది. ఈ మేరకు బాధితుడు పల్లెపు మర్కెండేయులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మార్కండేయలు కర్నాటక లోని రాయచూర్‌లో పోలాలు కౌలుకు తీసుకుని వ్యవసాయ చేస్తుంటారు. ఈ క్రమంలో కుటుంబతో సహా వెళ్ళారు. ఇది గమనించిన దుండగులు ఇంట్లోకి చొరబడి సుమారు లక్షరూపాయలు విలువైన ఒక కేజీ వెండి వస్తువులు 11, వేలు నగదు అపహరించుకు పోయినట్లు బాధితుడు వాపోయాడు . రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇళ్లు తొలగించవద్దని చిల్లపల్లికి వినతి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎర్రబాలెం ఈ లెవెన్ రోడ్డు ఇళ్ళ బాధితులు బుధవారం ఏపీ ఎంఎస్ ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావును మంగళగిరి ఏపీ ఎంఎస్ ఐడిసి కార్యాలయం వద్ద కలిసి వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసరావుకు ఈ లెవెన్ రోడ్డు ఇళ్ల బాధితుల సమస్యలను సిపిఎం రాజధాని కార్యదర్శి ఎం రవి వివరించారు. ఎర్రబాలెంలోని పేదల ఇల్లు తొలగించకుండా ఏలైన్మెంట్ మార్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్ , నారాయణ ల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు ఇళ్ళ బాధితుల సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు. డిప్యూటీ సీఎం అపాయింట్మెంట్ తీసుకొని బాధితులను పవన్ కళ్యాణ్ వద్దకు తీసుకు వెళతానని, నివాస ప్రాంతాల్లో మార్కింగ్ వేసిన రోడ్డు మ్యాప్ ను పరిశీలించేందుకు ఎర్రబాలెంలో పర్యటిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఎంరవి మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిలో భాగంగా వేస్తున్న రోడ్డు నిర్మాణాన్ని ఎర్రబాలెం ప్రజలు వ్యతిరేకించడం లేదని, తమ ఇళ్లు పోకుండా ఏలైన్మెంట్ మార్చి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మాత్రమే పేదలు కోరుకుంటున్నారని అన్నారు. గత 50 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో నివసిస్తున్న పేదల ఇల్లు రోడ్డు పేరుతో తొలగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని అన్నారు .అప్పు చేసి చిన్న చిన్న ఇల్లు నిర్మించుకున్న పేదలు తమ ఇళ్ల పై గుండా రోడ్డు వేసేందుకు అధికారులు మార్కింగ్ చేయడంతో నిద్రాహారాలు మా ని ఆందోళనలు చెందుతున్నారని అన్నారు . కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు సాలి నరేష్, జనసేన నాయకులు బి సాయి నందన్, సికా నీలాంబరం స్థానిక ఇండ్ల బాధితులు సాగర్ ఎన్ రవి, పి శ్రీనివాసరావు, టిగోపి, ప్రశాంత్, ఎన్ తిరుపతి వెంకయ్య,ఎం శివాంజనేయులు ఎస్ సురేష్ జి కిరణ్ పండు ఎం నాగరాజు ,బి మార్తమ్మ ఎస్ రేవతి ఏ సామ్రాజ్యం పాల్గొన్నారు.

విజయ పికిల్స్ రెండు టన్నుల పచ్చళ్లు వితరణ

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : ఏంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన విజయ పికిల్స్ అధినేత కాటూరి రాము శబరిమలై అయ్యప్ప స్వామి దేవస్థానానికి రూ. 6,50,000 విలువచేసే రెండు టన్నుల అన్ని రకాల పచ్చళ్ళను బుధవారం రాత్రి ప్రత్యేక వాహనంలో శబరిమలై పంపించారు. ఈ సందర్భంగా విజయ పికిల్స్ అధినేత కాటూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత 36 సంవత్సరాలుగా ప్రజల అభిరుచి మేరకు, మంచి రుచి, సుచితో అన్ని రకాల పచ్చళ్ళు తయారు చేస్తున్నామని అన్నారు. గతంలో కూడా తిరుపతి దేవస్థానానికి వివిధ రకాల పచ్చళ్ళు పంపించామని అన్నారు. మరల నేడు అయ్యప్ప స్వామి దేవస్థానానికి కూడా పచ్చళ్లను పంపించడం చాలా ఆనందదాయకంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాటూరి వెంకటేశ్వరరావు, కాటూరి శివ నాగేశ్వరరావు, నర సింహ, సురేష్, శివ కోటేశ్వరరావు, లోకేశ్వరరావు, వెంకటరెడ్డి, ప్రసాద్, అశోక్ పాల్గొన్నారు.

విజ్ఞాన్స్ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న వరప్రసాద్

బంగ్లాదేశ్‌లో అమలు చేస్తున్న త్రిముఖ వ్యూహాన్ని (నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్‌లో సులభ వాణిజ్యం) మనం కూడా అనుసరి ంచాలని ఐకార్- ఐఐఓఆర్ మాజీ డైరక్టర్, అపారి ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కేఎస్ వరప్రసాద్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో 'ప్లాంట్ హెల్త్ ఇన్ ఆసియా- రీసెర్చ్ ప్రయారిటీస్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్' అనే అంశంపై రెండ్రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ సదస్సు బుధవారం ముగిసింది. సదస్సులో వరప్రసాద్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో ఎస్‌పీఎస్ (శానిటరీ, ఫైటోశానిటరీ) అనేవి వ్యవసాయ ఉత్పత్తులు, ఆహార ఉత్పత్తుల ఆరోగ్యభద్రతను కాపాడటానికి, పర్యావరణ పరిరక్షణకు రూపొందించబడిన నిబంధనలని తెలియజేశారు. ఈవిధానాలు అంతర్జాతీయ వాణిజ్యంతో సంబంధం కలిగి ఉంటాయన్నారు.అనేక దేశాలు తమ నిర్దిష్టమైన ఉత్పత్తులు, ప్రత్యేకించి వ్యవసాయ ఉత్పత్తులు, విదేశీ మార్కెట్లకు రవాణా చేసే ముందు ఆహార భద్రత, వ్యాధి నియంత్రణ, పర్యావరణ ఆపరేషన్లు తదితర అంశాల్లో నియంత్రణలు అమలు చేయడం అనివార్యంగా భావిస్తాయన్నారు. బంగ్లాదేశ్‌లో నాణ్యత, భద్రత, ప్రపంచ మార్కెట్లో సులభ వాణిజ్యాన్ని ప్రోత్సహించేందుకు అమలు చేస్తోందన్నారు. శానిటరీ నియమాలు ఆహార భద్రతపైన, ఫైటోశానిటరీ నియమాలు మొక్కల ఆరోగ్యానికి సంబంధించి, వాటి ఉత్పత్తి, పర్యవేక్షణకు సంబంధించినవని తెలియజేశారు. ఈ విధానాలు దేశానికి ఎగుమతులు పెంచడమే కాకుండా, పంటల నాణ్యత పెంచడం, పర్యావరణాన్ని కాపాడటం, రైతుల ఆదాయాలను మెరుగుపరచడంలో సహాయపడతాయన్నారు. ఇటలీలోని ఐఐపీపీసీ సెక్రటెరియట్, ఎఫ్ఏవో ఇంప్లిమెంటేషన్ అండ్ ఫెసిలిటేషన్ లీడ్ డాక్టర్ సారా బ్రూనెల్ మాట్లాడుతూ మొక్కల ఆరోగ్యం అనేది వ్యవసాయం సుస్థిరత, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రతకు సంబంధించిన ఒక కీలక అంశమన్నారు. ప్రపంచవ్యాప్తంగా మొక్కల వ్యాధులు, కీటకాలు, ఇతర ఆపత్కాల సమస్యలు వ్యవసాయ రంగాన్ని కఠినంగా ప్రభావితం చేస్తూ ఉంటాయన్నారు. ఆసియాలో మొక్కల వ్యాధులు, కీటకాలు వర్తక మార్గాల్లో వేగంగా వ్యాపిస్తున్నాయని, అంతర్జాతీయ వాణిజ్యం పెరిగేకొద్దీ ఈసమస్యలు మరింత తీవ్రమవుతున్నాయని తెలియజేశారు. ఆసియాలో ఉన్న పర్యావరణ మార్పులు, వేడి పెరగడం, మబ్బు, వర్షాలు వంటి క్లిష్ట పరిస్థితులు మొక్కల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో సౌత్ ఏసియా సీఏబీఐ ఇంటర్నేషనల్ రీజనల్ డైరక్టర్ డాక్టర్ వినోద్ పండిట్ ప్రసంగించారు. అనంతరం పల్నాడు, ప్రకాశం, క్రిష్ణ, పశ్చిమ గోదావరి, గుంటూరు జిల్లాలకు చెందిన 145 మంది రైతులతో రైతునేస్తం చైర్మన్ డాక్టర్ వై.వెంకటేశ్వరరావు ప్యానెల్ డిస్కషన్ నిర్వహించారు,కార్యక్రమంలో విజ్ఞాన్స్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు తదితరులు పాల్గొన్నారు.

ముడుపుల ఒప్పందాన్ని కొనసాగిస్తున్న కూటమి



ప్రజాశక్తి - వినుకొండ

విద్యుత్ ట్రూ అప్, ఇందనపు సబ్ ఛార్జీల బారాలను ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు శావల్యాపురం సబ్ స్టేషన్ వద్ద ఆ పార్టీ నాయకులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కెవిఆర్ మోహన్ చంద మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు రూ.లక్ష కోట్ల పైగా భారాన్ని ప్రజలపై భారం మోపే ఆదాని సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని ముడుపులు తీసుకుని మోడీ ఒత్తిడి మేరకు జగన్ ప్రభుత్వం చేసుకుందని విమర్శించారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం కొనసాగిస్తూ జగన్, ఆదాని అవినీతిని కాపాడటం దారుణమన్నారు. కోటిన్నరమంది వినియోగదారులకు ఆదాని స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల ప్రజలపై రూ.15000 కోట్ల భారం పడనుందని చెప్పారు. ఈ మీటర్ల ఏర్పాటును ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గణపరితి, వెంకటేశ్వర్లు, బి.వెంకటరాయుడు, బి.చిన్నవెంకయ్య, పి.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, ఎస్.గోవిందరాజులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - అమరావతి

విద్యుత్ స్మార్ట్ మీటర్లు వల్ల రాబోయే రోజుల్లో ఇళ్ల అంధకారంలోకి వెళ్లనున్నాయని సిపిఎం అమరావతి రూరల్ కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. అమరావతిలోని పలుచోట్ల అదానీ కంపెనీ సిబ్బంది ఇటీవల ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను సిపిఎం నాయకులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ప్రజలపై విద్యుత్ బిల్లుల భారంతోపాటు ఆదాని కార్పొరేటర్ కంపెనీలకు ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. విద్యుత్ కోసం ముందుగానే రీఛార్జి చేసుకోవాల్సిన పరిస్థితి ప్రజలకు వస్తుందని, రీఛార్జి అయిపోతే చీకట్లో మగ్గాల్సి ఉంటుందని హెచ్చరించారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలను ఈ విధానం అంధకారంలోకి నెడుతుందన్నారు. కార్యక్రమంలో మొహిద్దీన్‌వలి, సాంబశివరావు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల భారాలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సిపిఎం నిరసన






తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి

ప్రజాశక్తి -ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు. సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు జి.బాలకృష్ణ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోందని, ఇది వారికి తీవ్ర నష్టం తెస్తోందని చెప్పారు. అనంతరం తహశీల్దార్ భవాని శంకర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు జి.జాలయ్య, ఎం.వెంకటరెడ్డి, అమర లింగేశ్వరావు, టి.మస్తాన్‌రావు, నాగేశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు, నరసింహారావు, జాన్‌పీరా పాల్గొన్నారు.



జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లి క్రీడాకారుని రికార్డు

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తెనపల్లికి చెందిన క్రీడాకారుడు సరికొత్త రికార్డు సృష్టించాడు. ఢిల్లీలోని కర్ణాలిసింగ్ స్టేడియంలో ఈనెల 16వ తేదీ నుండి జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ సీనియర్ మెన్ జూనియర్, సబ్ జూనియర్, ఉమెన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న సత్తెనపల్లికి చెందిన పసుపులేటి వంశీకృష్ణ బంగారం, వెండి పతకాలను కైవసం చేసుకున్నాడు. డెడ్ లిఫ్ట్ లో 297.5 కిలోల బరువెత్తి సరికొత్త రికార్డు సృష్టించాడు. జూనియర్ విభాగం 74 కిలోల విభాగంలో బంగారం, వెండి పతకాలు సాధించడంతోపాటు ఓవరాల్‌గా 680 కిలోల బరువు ఎత్తి త్వరలో జరగనున్న ఆసియా, యుఎస్ఎ వరల్డ్ చాంపియన్షిప్ పోటీలకు అర్హత సాధించాడు. వంశీకృష్ణను పవర్‌లిఫ్టింగ్ పల్నాడు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, అంతర్జాతీయ క్రీడాకారులైన పసుపులేటి సురేష్, పల్నాడు జిల్లా అధ్యక్షులు జిమ్‌రాజు, తిరుమలశెట్టి శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, కత్తి పవన్, మాతంగి రాహుల్ గౌతమ్, జి.రమేష్, శాంతయ్య, ప్రముఖులు అభినందించారు.

తపాలా శాఖ లేఖా రచన పోటీ గడువు పెంపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : విద్యార్థులు, యువతకు లేఖలు రాయడాన్ని అలవాటు చేసేందుకు తపాలా శాఖ నిర్వహిస్తున్న జాతీయ లేఖా రచన పోటీల గడువు తేదీని పొడిగించినట్లు తపాలా శాఖ సూపరింటెండెంట్ పి.వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ధాయ్ ఆఖర్' పేరుతో లేఖా పోటీలకు ఈ నెల 14 వరకు ప్రకటించిన గడువును జనవరి 31 వరకు పొడిగించారని, మరిన్ని వివరాలకు సమీపంలోని పోస్టాఫీసుల్లో సంప్రదించాలని సూచించారు.

సహకార బకాయిలు రూ.50 కోట్ల పైనే

80 శాతం వసూళ్లకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : సహకార సంఘాల మొండి బకాయిలు రూ.50 కోట్లకు మించి ఉన్నాయని, వచ్చే మార్చి నాటికి 80 శాతం తగ్గించాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. 4వ జిల్లా సహకార సంఘాల అభివృద్ధి కమిటీ సమావేశం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించగా సహకార సంఘాల అభివృద్ధి పంచవర్ష ప్రణాళికకు ఆమోదం తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి లక్ష్యాలను నిర్దేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బకాయిల వసూలుతోనే సహకార వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. సరైన రహదారి లేని 23 సహకార సంఘాల గోడౌన్లకు డ్వామా సహాయంతో రోడ్లు నిర్మించాలని సూచించారు. నాదెండ్ల మండలంలోని జన్‌ఔషధి కేంద్రానికి అదనంగా 4 జన్‌ఔషధి కేంద్రాలను ప్రారంభించాలన్నారు. మార్చి నాటికి సహకార సంఘాల నేతృత్వంలో రెండు కొత్త పెట్రోల్ స్టేషన్లు ప్రారంభించి, 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరో ఐదు పెట్రోల్ స్టేషన్లు, ఐదు గ్యాస్ స్టేషన్లు నిర్మించాలని చెప్పారు. కోల్డ్ స్టోరేజీలు, ఎరువుల షాపులు, షాపింగ్ కాంప్లెక్సులు, సూపర్ మార్కెట్ల సంఖ్యను పెంచాలన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా కారుమంచి, బొగ్గరం, ముప్పాళ్ల, శావల్యాపురం, అమరావతి, అత్తలూరు గ్రామాల్లో పిఎం సూర్యఘర్ పథకం ద్వారా 300 యూనిట్లలోపు విద్యుత్ వాడే సహకార సంఘాల సభ్యులకు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు రాయితీ రుణాలివ్వాలని సూచించారు. సమావేశంలో జెసి సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా సహకార అధికారి వెంకట రమణ, నాబార్డు డిడిఎం శరత్, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.కాంతారావు, మత్స్యశాఖ అధికారి సంజీవరావు, పంచాయతీ రాజ్ ఏఇ జయకృష్ణ, సహకార బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.





క్రీడల్లోనూ రాణించాలి : డీఎస్పీ

ప్రజాశక్తి సత్తెనపల్లి టౌన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణిస్తే ఉజ్వల భవిషత్ వారి సొంతమవుతుందని డీఎస్పీ ఎం.హనుమంతరావు అన్నారు. స్థానిక శరభయ్య క్రీడా మైదానంలో అక్స్‌ఫర్డ్ పాఠశాల ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ డేను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని, మన నడవడికే మనల్ని ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందని ఉద్బోధించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ జోసెఫ్, ప్రిన్సిపాల్ లావణ్య లహరి, ఉపాధ్యాయులు విజయ, సైదాబి, పిఇటి మౌలాలి పాల్గొన్నారు.

భూమి తీసుకున్నా పరిహారం ఇవ్వలేదు

రెవెన్యూ సదస్సుల్లో జాతీయ రహదారి బాధిత రైతుల వినతి



ప్రజాశక్తి - దాచేపల్లి

జాతీయ రహదారి కోసం భూములు తీసుకున్న ప్రభుత్వం నష్టపరిహారం పూర్తిగా ఇవ్వలేదని పలువురు రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు విన్నవించారు. పట్టణంలోని నడికుడి సచివాలయంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించగా తహశీల్దార్ కుటుంబరావు మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యను సభలో వివరించారు. నడికుడి నుండి మాచర్ల వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 16) నిర్మాణం కోసం గ్రామానికి చెందిన 16 మంది రైతులు వద్ద నుండి కొంత భూమిని తీసుకున్నారని, అయితే కొంతమందికి పరిహారం ఇంకా ఇవ్వలేదని చెప్పారు. దీనిపై పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కలేదని వాపోయారు. ఈ మేరకు తహశీల్దార్‌కు బాధిత రైతులు కె.శ్రీనివాసరావు, గుడె పాపయ్య, కోగంటి శివన్నారాయణ, దండా ఆంజనేయులు, కోరిమల్ల శ్రీనువాసరావు, నాగేశ్వరరావు, లోట్టపల్లి రాజారావు తదితరులు వినతిపత్రం ఇచ్చారు. ఇదిలా ఉండగా సదస్సులో తహశీల్దార్ మాట్లాడుతూ భూముల ఆన్‌లైన్, విద్యార్థులకు ధ్రువపత్రాలు, ఇతర రెవెన్యూ సమస్యలకు సదస్సుల్లో పరిష్కారం చూపుతామన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుండి పలు అర్జీలను తీసుకుని పరిష్కారానికి హామీనిచ్చారు. కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈవో నెమలిరెడ్డి, ఆర్ఐ శరత్, వీఆర్వో రమేష్, యలమంద, గ్రామ సర్వేయర్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎన్.పుల్లయ్య, బుల్లబ్బాయి, జి.నారాయణ, డి.వెంకట్రామయ్య, శ్రీరాములు, పాల్గొన్నారు.



కంకణాలపల్లి సదస్సులో సిపిఎం వినతి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని కంకణాలపల్లిలో జరిగిన సదస్సులో పలు సమస్యలపై తహశీల్దార్ చక్రవర్తికి సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ వినతిపత్రం అందజేశారు. చిన్న పనులకు కూడా రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని, రేషన్‌కార్డుల్లో పేర్ల నమోదులో కూడా అలసత్వం వహిస్తున్నారని చెప్పారు. సాగు దారుడు కాకుండా మరొకరి పేరుతో భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. జాతీయ రహదారి కింద భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. వావిలాల నగర్ కాలనీలో నివసిస్తున్న 400 కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.సుధీర్, సోలనంబి, పి.అప్పారావు, మల్లీశ్వరి, నారాయణ పాల్గొన్నారు.

సందెపూడిలో కలెక్టర్ పరిశీలన

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని సందెపూడిలో రెవెన్యూ సదస్సును పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు సదస్సులు ఉపయోగపడతాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రెవెన్యూ సదస్సులు జరిగి నెలైనా సమస్యలకు పరిష్కారమేది?

తక్షణమే పరిష్కరించాలని సిపిఎం నాయకులు పాశం రామారావు డిమాండ్

ప్రజాశక్తి - పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. బుధవారం పెదనందిపాడు తేళ్ళ నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం నాయకులు కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నెల క్రితం నిర్వహించి చారన్నారు. అప్పుడు వచ్చిన అప్లికేషన్లు పరిష్కరించక పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళ స్థలాలలో మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించి, ప్రభుత్వమే రూ.5 లక్షలతో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. నూతన ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు, సామాజిక పెన్షన్ కు సంబంధించి అప్లికేషన్లు ఇంతవరకు తీసుకోవడం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికి వెంటనే రేషన్ కార్డులు, సామాజిక పెన్షన్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధరకు మార్కెట్ యార్డులలో కొనుగోలు చేయాలని కోరారు. రబీ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ మీద అందించిన శనగలు, మార్కెట్ ధర కన్నా అధిక ధరకు ఇవ్వడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. వరి పంటను నిబంధనలు సడలించి పంట మొత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, రైతు సేవా కేంద్రాలలో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరారు. పెదనందిపాడు మండలంలోని గ్రామాలలో మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పంచాయతీ అధికారులు రెగ్యులర్‌గా మురుగు కాల్వల్లో పూడికతీత తీయాలని, దోమల నివారణ మందు స్ప్రే చేయాలని కోరారు. ప్రజలు శీతాకాలంలో దోమల సమస్య వల్ల వివిధ రకాల జ్వరాలు, జబ్బులు బారిన పడుతున్నారని తెలిపారు. గుంటూరు ఛానల్ పర్చూరు వరకు పొడిగించటానికి అవసరమైన భూసేకరణ కు నిధులను వెంటనే కేటాయించి పనులు పూర్తిచేయాలని, నల్లమడ వాగు ముంపు నివారణకు ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు.గతంలోని వైసిపి ప్రభుత్వం ప్రజల మీద సర్దుబాటు చార్జీల పేరుతో మోపిన విద్యుత్ భారాలను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేస్తామని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నిలిపివేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల మీద వేలకోట్ల రూపాయలు సర్దుబాటు చార్జీల భారం మోపారని, స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేశారని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులను ఎదుర్కొంటారని తెలిపారు. సౌర విద్యుత్ కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న గౌతమ్ ఆదానీ మరియు ప్రతిపక్ష నాయకుని పై కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం సమంజసం కాదన్నారు. మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు మాట్లాడుతూ స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, మండలం కేంద్రంలో, గ్రామాలలో రోడ్ల మరమ్మతుల పనులు వెంటనే చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ముద్దన వెంకటేశ్వర్లు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ తదితరులు పాల్గొన్నారు.



పెదనందిపాడు సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలి

ఎస్ఇకి సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక 41వ డివిజన్, పుచ్చవల్లి సుందరయ్య నగర్‌లో పేదల ఇళ్లకు బిగించిన 15 స్మార్ట్ మీటర్లను తొలగించాలని సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ కోరారు. ఈమేరకు బుధవారం పార్టీ నగర నాయకులు ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ కెవిఎల్ మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నళినీకాంత్ మాట్లాడుతూ సుందరయ్య నగర్‌లో ఇంటి యజమానులకు తెలియజేయ కుండా స్మార్ట్ మీటర్లు బిగించారని తెలిపారు. వీరిలో ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీలని, 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌కు అర్హులైన వారేనని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు, వ్యాపార వాణిజ్య సముదాలకు, 500 యూనిట్లకుపైగా కరెంటు వాడే వారికి మాత్రమే స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు బిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా, దానికి భిన్నంగా పేదల ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని అన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లు బిగించిన వాటిని తొలగించాలని కోరారు. దీనికి ఎస్ఈ కెవిఎల్ మూర్తి పైఅధికారులను సంప్రదించి, వెంటనే పేదల ఇళ్లకు బిగించిన స్మార్ట్ మీటర్లను తొలగించి, పాత మీటర్లనే కొనసాగించే విధంగా కృషి చేస్తామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నగర నాయకులు ఆది నికల్సన్, షేక్.ఖాశిం షహీద్ పాల్గొన్నారు.



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న సిపియం నాయకులు

విద్యుత్ ఒప్పందాలను వెంటనే సమీక్షించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సౌర విద్యుత్ ఒప్పందాల వ్యవహారంలో అదానీ అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో మొత్తం ఈఉదంతంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరపాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ కార్యదర్శి నర్రా శ్రీనివాస్ కోరారు.ఏటి అగ్రహారం మధ్యతరగతి స్టడీసర్కిల్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 'అదానీతో విద్యుత్ ఒప్పందాలు-ప్రజలపై ప్రభావం' అనే అంశంపై ఏ.టి.అగ్రహారం 8వ లైనులో శంతన్ హైస్కూల్‌లో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఇంజనీర్ ఎమ్.డి.అక్బర్ అధ్యక్షత వహించారు. నర్రా శ్రీనివాస్ మాట్లాడుతూ అమెరికా ఇన్వెస్టర్లను, గ్లోబల్ ఆర్థిక సంస్థలను మోసం చేశారని, అమెరికన్ న్యాయ విభాగం గౌతమ్ అదానీతో సహా పలువురిపై కేసులు పెట్టడం తీవ్రమైన అంశమని అన్నారు. సోలార్ విద్యుత్‌కు సంబంధించి అదానీతో గతంలో చేసుకున్న ఒప్పందాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, వాటిని సమీక్షించాలని అన్నారు. బడా కార్పొరేట్ అనుకూల విధానాల ఫలితంగానే ఒక ప్రక్క భారీ స్థాయి ఆర్థిక నేరాలు చేసుకుంటున్నాయని, మరో ప్రక్క ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలు పడుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ గౌరవ డైరెక్టర్ బి.శ్రీరాములు, వి.వి.కె.సురేష్, విశ్రాంత ఇంజనీర్ జి.వెంకట్రావు, సి.హెచ్. గోపాలకష్ణ, వి.మోహన రావు, పి.శ్రీనివాసరావు, సి.హెచ్.ప్రమీల, వి.కోటేశ్వరశాస్త్రి, యు. వి. వి. ఆర్. సాగర్, ఎమ్.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నర్రా శ్రీనివాస్



మంత్రి మాట్లాడిన తీరు అభ్యంతరకరం

14వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి శాసనసభ్యులు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సిమెంటు ఫ్యాక్టరీ కార్మికులతో మాట్లాడిన తీరు అభ్యంతరకరమని పోరాట కమిటీ కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంత్రి నారా లోకేష్ దగ్గరకు కార్మికులతో కలిసి వెళ్లినట్లు చెప్పారు. కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 14 రోజులకు చేరు కున్నాయి. దీక్షలో బి ఆసియా, కైరునిషా, ఎం శారద, డి రమణ, అన్నమ్మ కూర్చున్నారు. దీక్షలను ప్రారంభించిన స్టీవెన్ మాట్లాడుతూ తాను ఎసిసి కార్మికుల సమస్యను వివరిస్తుంటే మంత్రి లోకేష్ వినడానికి కూడా సిద్ధపడలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును ఉల్లంఘించి గుడిసెలను కూల్చిన యాజమాన్యానికి వత్తాసుగా భూముల్లో గుడిసెలు ఎందుకేసారని కార్మికుల్ని ప్రశ్నించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎందుకు మాట్లాడలేదని కార్మికులను ఎదురు ప్రశ్నించినట్లు చెప్పారు. పదేపదే సమస్య పరిష్కరించమని నా వెంట ఎందుకు పడుతున్నారని న్యాయం చేయవలసిన మంత్రి ఇలా మాట్లాడటం తమకు ఆశ్చర్యం కలిగించిందని తెలిపారు. బాధ్యతగల స్థానంలో ఉన్న వ్యక్తి, మంగళగిరి ఎమ్మెల్యే ఇలా మాట్లాడితే మా సమస్యను ఎవరితో చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పు అమలు చేయని యాజమాన్యం మీద ఒత్తిడి చేయాల్సిన మంత్రి, సమస్యను కోర్టులోనే పరిష్కారం చేసుకోండి అని సూచించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, ఏ ఐ ఎఫ్ టి యు (న్యూ) నాయకులు కే ఆదినారాయణ మాట్లాడుతూ కార్మికులంతా ఒకే మాట మీద ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని ఉద్యమిద్దమని, అంతకు తప్ప మరో మార్గం లేదని తెలిపారు. ప్రభుత్వ మే సామరస్యంగా సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బి అంకయ్య, ఎం ఆశీర్వాదం, సూర్య ప్రకాష్, ఆర్ శివ, కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, గురవయ్య, శివమ్మ, దుర్గా భవాని, శారదా తదితరులు పాల్గొన్నారు.

వెంకటాద్రిపేటలో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు


క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక వెంకటాద్రిపేటలో రన్నింగ్‌రేస్, కబడ్డీ, లెమన్ స్పూన్, పాటలు, మ్యూజికల్ చైర్స్, స్కిప్పింగ్, కొప్పులోస్ట్రా మొదలగు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక మహిళలు, విద్యార్థులు, ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా ఆరుమళ్ళ నాగేశ్వరి, రోజమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఐద్వా నగర కార్యదర్శి కళ్యాణి, సిఐటియు నగర అధ్యక్షులు టి.రాధ, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి యశ్వంత్ పాల్గొని బహుమతులు అందచేశారు. నేటి సమాజంలో ఉరుకుల పరుగుల జీవితంలో ఇటువంటి కార్యక్రమాల ద్వారా మనసుకు, శరీరానికి ఎంతో ఉల్లాసం ఉంటుందన్నారు. అనంతరం రిటైర్డ్ అంగన్వాడి టీచర్ కస్తూరి ఉషారాణి, నాగరాజు కుమారి, మోహన రాధా, నగర ప్రధాన కార్యదర్శి కళ్యాణి, టి.రాధా క్రిస్మస్ కేకు కట్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సమీర్, సిఐటియు నాయకులు కె.శ్రీనివాసరావు, ప్రభావతి, ఫాతిమా, శ్రావణి అంగన్వాడీలు పాల్గొన్నారు.



వర్సిటీ ఫార్మసీ కాలేజీలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

నేటి పోటీ ప్రపంచంలో ఫార్మసీ రంగానికి భవిష్యత్తు ఉందని, బి ఫార్మసీ ఎం ఫార్మసీ వంటి కోర్సులు చేసిన విద్యార్థులకు మెండుగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇన్చార్జి వీసి ఆచార్య కే. గంగాధర రావు అన్నారు. విశ్వవిద్యాలయంలోని ఫార్మసీ కళాశాలలో బుధవారం నూతన విద్యార్థులకు పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంలో నూతన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించేందుకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీ ఆచార్య గంగాధర రావు మాట్లాడుతూ నేటి సమాజంలో ఆహారపు అలవాట్లలో విపరీతంగా మార్పులు వచ్చాయని తద్వారా అనేక రకాల రోగాల బారిన ప్రజలు పడుతున్నారని ఆహారపు అలవాట్లు నియంత్రణతో పాటు రోగాలను తగ్గించే ఔషధాలను తయారు చేసే బాధ్యత ఫార్మాసిస్టులపై ఉందని పేర్కొన్నారు. ఈ రంగంలో రాణించాలంటే ఓర్పు ఉండాలని సూచించారు. తద్వారా అనుకున్న లక్ష్యాలను వేగంగా సాధించవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఏ. ప్రమీల రాణి మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు ప్రత్యేక స్థానం ఉందని ఇక్కడ ర్యాగింగ్ వంటి అనైతిక చర్యలు లేవన్నారు. విద్యార్థులకు ఆధునిక లాబరేటరీ తో పాటు అర్హులైన అధ్యాపకులు బోధన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్యను అభ్యసించాల్సిన విద్యార్థులు లక్ష్యాన్ని నెరవేర్చుకొని ముందుకు సాగాలని కోరారు. బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్ డాక్టర్ మాధవి మాట్లాడుతూ వసతి గృహంలో మెరుగైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ రవి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ సజన, విజయ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


స్టాల్స్‌ను ప్రారంభించిన అడిషనల్ కమిషనర్ శకుంతల

తాడేపల్లిలో మెప్మాస్టాల్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని కృష్ణుడు గుడి వద్ద మెప్మా బజార్‌ను బుధవారం ఎమ్‌టిఎంసి అడిషనల్ కమిషనర్ కే శకుంతల, టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లనేని వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలు నెరవేర్చుటంలో భాగంగా మెప్మా అధికారుల ఆదేశాలతో స్వయం సహాయక సంఘాలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన స్టాల్స్ ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు ప్రభుత్వం అర్బన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. వీరులు, గృహోపకరణాలు తయారీతోపాటు ఇతర ఉత్పత్తులు తయారీని అడిగి తెలుసు కున్నారు. ప్రజల నుండి మంచి స్పందన వ్యక్తం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి కార్యదర్శి ధారదాసు, కేలి వెంకటేశ్వరరావు, ఎస్కే చాంద్‌బాషా, సంజీవరెడ్డి, సైదా పాల్గొన్నారు.



మైనారిటీ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- చిలకలూరిపేట

సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం కృషి చేయాల్సిన అవసరాన్ని మైనార్టీ హక్కులు దినోత్సవం గుర్తు చేస్తాయని బార్ అసోషియేషన్ ఆద్యక్షుడు సాపా ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని పసుమర్రు రోడ్డులో ఉన్న ఉర్దూ పాఠశాలలో బుధవారం మండల న్యాయాధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ హక్కులను ఉపయాగించుకోవాలన్నారు. న్యాయవాది శివబాబు, భాను ప్రసాద్ మైనారిటీల హక్కులపై వివరించారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -దాచేపల్లి

ఇటీవల అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న పట్టణానికి చెందిన జనసేన కార్యకర్త బొమ్మిరెడ్డి రామకృష్ణకు రూ.6 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం ఆ పార్టీ నేతలు అందించారు. కార్యక్రమంలో దాచేపల్లి మండల అధ్యక్షుడు పాముల కిషోర్, జనసేన పార్టీ మండల సీనియర్ నాయకులు ఆవుల శ్రీనివాసరావు, తోట నాగేశ్వరరావు, బత్తుల వెంకయ్య, ఆవుల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరాభివృద్ధికి సోపానాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరాభివృద్ధికి సోపానాలని బాపట్ల విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ దేవరపలి వెంకటరావు అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు - స్థానికీకరణ అంశంపై మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు.గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై ప్రభుత్వ యంత్రాంగానికి కూలంకషంగా వివరించారు. ప్రణాళికా బద్ధమైన అంచనాల తయారీలో సిబ్బంది ఎలా వ్యవహరించాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో స్వరూప రాణి, ఎంపీపీ తలతోటి రాణి, ఈవోపీఆర్డీ నిర్మల లక్ష్మీ కుమారి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, ఎంఈఓ కృష్ణారెడ్డి, గణపవరం మెడికల్ ఆఫీసర్ కవిత, అంగన్వాడీ సూపర్ వైజర్ నిర్మల కృష్ణమాల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

సత్తెనపల్లి రూరల్ : సుస్థిరాభివృద్ధిపై మండల స్థాయి అధికారులకు చేపట్టిన శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.శ్రీనివాసరెడ్డి. ఈపీఓఆర్డీ ఎ.శ్రీనివాసరెడ్డి, ఏపీఎం సమాధానం పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి - యడ్లపాడు

స్థానిక సొలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెన్నులు, స్వీట్లను అర్వపల్లి సాంబశివరావు బుధవారం పంచిపెట్టారు. తన తండ్రి జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు చెప్పారు.

వర్షాలతో వరి రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి- చిలకలూరిపేట

మండలంలో వర్ష సూచన ఉన్నందున వరి పండించిన రైతులు అప్రమత్తంగా ఉండాలని.. వర్ష పరిస్థితులను బట్టి పంట కోత చేయాలని మండల వ్యవసాయాధికారిణి టి.శ్రీలత సూచించారు. బుధవారం కుక్కపల్లివారిపాలెం, వేలూరు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పంట కోత చేసిన రైతులు సురక్షిత ప్రాంతాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు.శనగ వేసిన రైతులు పూత దశలో 13:0:45 నీటిలో కరిగే ఎరువును పిచికారీ చేసుకోవడం వల్ల గింజ నాణ్యతా ప్రమాణం బాగుంటుందని, అధిక దిగుబడి వస్తుందని చెప్పారు.



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి జీపీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చిరుమామిళ్ల, తూబాడు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

నాదెండ్ల : మండలంలోని తూబాడు, చిరుమామిళ్ల



గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం డిడిఏ ఎం.శివకుమార్, నరసరావుపేట వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ పాల్గొని రైతులకు పంటలలో పాటించవలసిన చర్యలపై వివరించారు. రబీ కాలంలో వరి వేసిన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, గ్రామ ఉద్యాన సహాయకులు కృష్ణ సౌజన్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు పదునైన చట్టాలు

ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

సమాజంలో మహిళల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలు చేస్తోందని ప్రభుత్వ అదనపు న్యాయవాది బగ్గి నరసింహారావు తెలిపారు. బుధవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో నిర్వహించిన మహిళలు- రక్షణ చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. పోక్సో చట్టం మహిళలకు రక్షణ కవచం వంటిదన్నారు. చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకొని రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. సీడీపీవో శ్రీలత బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఏసీడీపీవో



సంతోషకుమారి, సూపెర్వైజర్ ప్రమీల, డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ప్రాంగణ ఎంపికల్లో 48 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గుంటూరు కేంద్రంగా నడుస్తున్న 'ఇంగ్లీష్ ఫర్ యు' కంపెనీ తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 48 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. డిగ్రీ చివరి ఏడాది విద్యార్థులకు కంపెనీ డైరెక్టర్ ప్రసాద్, మేనేజింగ్ డైరెక్టర్ సత్యశ్రీ, హెచ్‌ఆర్ ప్రతినిధులు వివిధ విభాగాలలో ఎంపికలు నిర్వహించారని చెప్పారు. తమ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలపై ఎప్పటికప్పుడు శిక్షణ, అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. బహుళ జాతి కంపెనీలు తమ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో పలువురు విద్యార్థులు ఎంపిక కావడం గర్వంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను కళాశాల డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, టిపిఓ ఎం.బాల కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

'కూటమి పాలనలోనే రాష్ట్ర అభివృద్ధి'

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.దారునాయక్ అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లోని దేశవరపు క్యాంపు తండాలో శ్రీ మాతా జగదాంబ, అభయాంజనేయ స్వామి, సద్గురు సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షిక వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఆరు నెలల్లోనే రాష్ట్రం అభివృద్ధిలోకి దూసుకుపోతోందని తెలిపారు. అనంతరం స్థానిక పీటీజీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు



కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్ శ్యాముల్ జోబ్‌ను ఆరా తీశారు. కార్యక్రమంలో వీపీ సౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, వజ్రం నాయక్, డాక్టర్ ఎన్.బసివిరెడ్డి, సత్తిబాబు, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఊరే మార్క్, శ్రీరామూర్తి, పాండు నాయక్, స్వామి నాయక్, రామ్ చంద్, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

'పెన్షన్ల తొలగింపుపై అసత్య ప్రచారం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కూటమి ప్రభుత్వం అక్రమంగా 1.57 లక్షల మంది లబ్ధిదారుల పెన్షన్లు తొలగిస్తున్నట్లు వైసిపి అనుకూల మీడియాలో వస్తున్న వార్తలను నమ్మొద్దని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. నరసరావుపేట పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను. అభివృద్ధిని ప్రచారం చేయని వైసిపి అనుకూల మీడియా.. అసత్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో ఉత్సాహం చూపుతుందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పెన్షన్ దారుడికీ కోత విధించలేదని గుర్తు చేశారు. గతానికి భిన్నంగా ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే.. మరో నెలలో అందించడంతోపాటు, నివాస ప్రాంతానికి మార్చుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా చేసిన సర్వేలో అనర్హులు ఉన్నట్టు గుర్తించినప్పటికీ వారి వద్ద నుంచి వివరణ తీసుకోవాలని, సహేతకంగా ఉంటే పెన్షన్లు ఆపవద్దని మాత్రమే సూచించినట్లు తెలిపారు. వాస్తవాలను వక్రీకరించి లబ్ధిదారులను అయోమయానికి గురి చేయడం సరికాదని హితవు పలికారు.

ప్రజల సహకారంతోనే పరిసరాల శుభ్రత

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే ప్రజారోగ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. ఈ నేపథ్యంలోనే పురపాలక శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పరిసరాల శుభ్రతకు తన వంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. బుధవారం పట్టణంలోని 23వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పార పట్టుకుని స్వయంగా కాలువలు శుభ్రం చేశారు. రహదారికి ఇరువైపులా ఉన్న పనికిరాని మొక్కలను తొలగించారు. వార్డులోని చెరుకూరి హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను చెరుకూరి హాస్పిటల్ అధినేత డాక్టర్ ఫణి కుమార్ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గుత్తా అంకమ్మ చౌదరి, క్రాంతి, 23వ వార్డుకు చెందిన కూటమి నాయకులు పాల్గొన్నారు.





వేడుకగా సెమీక్రిస్మస్

ప్రజాశక్తి - వినుకొండ

సాటి మనిషి పట్ల ప్రేమ, బాధ్యతను తెలియజేయడమే క్రిస్మస్ సందేశమని శ్రీరామ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ కె.వి.ఆర్.మోహన్ చంద్ అన్నారు. బుధవారం స్థానిక శ్రీరామ పబ్లిక్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ కె.రత్నకుమారి క్రిస్మస్ కేకును కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. పాఠశాల డైరెక్టర్ కె.అజిత్ చంద్ పాల్గొన్నారు.

స్వయం సమృద్ధిగా గ్రామాలు

ప్రజాశక్తి - పెదకూరపాడు : స్వయం సమృద్ధిగా గ్రామాలు అభివృద్ధి చెందాలని పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. సుస్థిరాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పొందిన అంశాలు పాటిస్తే గ్రామాలు ఆర్థిక స్వావలంబన సాధిస్తాయన్నారు. మహిళ స్నేహపూర్వక వాతావరణంపై ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ మున్ని, స్వయం సమద్ధిగా మౌలిక అంశంపై ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయికుమార్, వాటర్ శానిటేషన్ విజన్ పై పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శరత్, ఏపీఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సూచనలు అమూల్యం


సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి
ఉద్యోగ విరమణ పొందిన సీనియర్ సిటిజన్స్ సలహాలు, సూచనలు నేటి తరానికి ఎంతో అవసరమని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, ఏపీఎస్పీ ఆరో బెటాలియన్ కమాండెంట్ పి.నాగేష్ బాబు, అడిషనల్ కమాండెంట్ ఆశీర్వాదం, యు.రవి, జనార్దన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు అన్నారు. వారి సేవలను కొత్తగా విధుల్లో చేరుతున్న ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం మంగళగిరి ఏపీఎస్పీ పెన్షనర్స్ కార్యాలయం వద్ద జాతీయ పెన్షనర్స్‌డేను పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు తాటి కృష్ణారావు నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. పెన్షనర్లకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం 70 సంవత్సరాలు నిండిన 16 మంది పెన్షనర్లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పావనరావు, వీకే గోవర్ధన్, ఎస్ఎస్ రెడ్డి, ఎంఎస్‌కే శ్రీధర్, హరినాథరావు, గుడిపాటి చిన్న తిరుపతి నాయుడు, నాంచారయ్య పాల్గొన్నారు.



ఆదర్శం.. ఆ రైతు దంపతులు

➤ అవయవదానానికి అంగీకారం

ప్రజాశక్తి-దుగ్గిరాల
మరణించిన తర్వాత ఈ శరీరం మట్టిలో కలిసిపోవాల్సిందే. అదే.. శరీరంలోని అవయవాలను దానం చేస్తే.. మరికొంతమందికి కొత్త జీవితాన్ని ప్రసాదించవచ్చు. ఈ రైతు దంపతులు కూడా ఆ ఆలోచనతోనే.. తమ మరణానంతరం తమ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించి, నలుగురికీ ఆదర్శంగా నిలిచారు. మండలంలోని వీర్లపాలెం గ్రామానికి చెందిన రైతు ఈమని వెంకటరెడ్డి, సాహితీ శారద దంపతులు మరణానంతరం తమ శరీరాలను ఎయిమ్స్ ఆసుపత్రికి దానంగా ఇచ్చినట్లు అఖిల భారత శరీర అవయవ దాన సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి ఆర్.నర్సద తెలిపారు. ఈ మేరకు రైతు వెంకటరెడ్డి బుధవారం మంగళగిరిలోని ఆమె స్వగృహంలో రాతపూర్వకంగా బాండ్లను అందజేసినట్లు చెప్పారు. ఆరోగ్యవంతుల అవయవాలు మరణాంతరం ఇతరులకు ఉపయోగపడతాయని తెలిపారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యం



ప్రజాశక్తి - చేబ్రోలు :
గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి సాధించడమే లక్ష్యమని ఈవోపీఆర్‌డీ టి.ఉషారాణి అన్నారు. బుధవారం గ్రామీణ సుస్థిరాభివృద్ధి మూడవరోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కె.లలితతో కలిసి ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ శైలజ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలే సోపానాలు..

కొల్లిపర : ఆరోగ్యవంతమైన గ్రామాలే సుస్థిరాభివృద్ధికి సోపానాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-స్థానికీకరణ అనే అంశాలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచులకు, సచివాలయ సిబ్బందికి, పంచాయతీ కార్యాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామస్థాయిలో సుస్థిర అభివృద్ధికి తోడ్పడే 17 అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎంపీపీ భీమవరం పద్మావతి, ఈవోపీఆర్‌డీ భార్గవ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి - మేడికొండూరు
సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని, ఇళ్లలో పెద్దవారినీ చైతన్యం చేయాలని సీఐ ఎస్‌కే నాగూర్ మీరా సాహెబ్ సూచించారు. స్థానిక ఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలు, వాటి నుంచి తప్పించుకోవడం ఎలా అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీహరిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌తో గడపవద్దని సూచించారు. మహిళలు, విద్యార్థినులు ఆన్‌లైన్ స్నేహాల పట్ల జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పడం, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు తెరవడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే కాజేబాబు, స్టెప్ ఆర్గనైజేషన్ సీఈవో రాధిక, చంద్రమౌళి, విద్యార్థులు పాల్గొన్నారు.

'మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు'


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు, కూటమినాయకులు

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా బజార్ అర్బన్ మార్కెట్ ను కమిషనర్ సలీం బాషా, టిడిపి గుంటూరు పార్లమెంట్ కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు బుధవారం ప్రారంభించారు. స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ చేసుకునేందుకు ప్రభుత్వం అర్బన్ మార్కెటింగ్ ఏర్పాటు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ కె.శకుంతల, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.విజయ లక్ష్మి, టిడిపి పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ప్రజాశక్తి-తెనాలిరూరల్
ఏపీఎస్ఆర్టీసీ తెనాలి పరిధిలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు 99592 25422 నంబరుకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఆర్టీసీకి సంబంధించి సూచనలు, సలహాలు, బస్సుల నడిచే మార్గాల్లో ఇబ్బందులు తదితర అంశాలను తెలియజేయవచ్చని డిపో మేనేజర్ రాజశేఖర్ పేర్కొన్నారు.

ఘనంగా సుదర్శన సహిత నరసింహ హోమం


హోమంలో పాల్గొన్న దంపతులు

ప్రజాశక్తి-మంగళగిరి
మంగళగిరి శ్రీ లక్ష్మీ నారాయణస్వామి వారి ఆలయ ప్రాంగణంలో భూమిపుత్ర ఇన్ఫ్రా డెవలపర్స్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం సుదర్శన సహిత లక్ష్మీనరసింహ హోమం చేపట్టారు. కొమ్మారెడ్డి హేమారామిరెడ్డి, ప్రియాంక దంపతులతోపాటు మరో 10 మంది దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప, భవానీ, శివ మాలధారణ భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి, ఛాయాదేవి దంపతులు, వివిధ రంగాల ప్రముఖులు కొమ్మారెడ్డి అంజిరెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, గల్లా శ్రీనివాసరావు, మనోహర్ బాబు, నిమ్మగడ్డ గోపాల్, ఈవెంట్స్ నాని, తాళ్ల వేణుగోపాల్ రెడ్డి, వేగే వాణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం.. దళారులను ఆశ్రయించవద్దు...

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా
ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని.. రైతులు దళారులను ఆశ్రయించవద్దని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పల్నాడు జిల్లా మేనేజర్ పి.సుశీల ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2024-25 పంట కాలానికి గాను జిల్లా లోని 28 మండలాలలో 115 క్లస్టర్ రైతు సేవా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కోసంఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లాలో ఇప్పటి వరకు 3 రైతు సేవా కేంద్రాల పరిధిలో 6 గురు రైతుల వద్ద నుంచి 31.480 మెట్రిక్ టన్నుల ధాన్యం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుతం వాతావరణ శాఖ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించిన నేపథ్యంలో రాబోయే రెండు,మూడు రోజులపాటు వరి నూర్పిడి పనులు నిలిపివేసేలా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రైతులకు గోనె సంచులు, 166 టార్పాలిన్లు క్లస్టర్ రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామని చెప్పారు.



'శిశిరం' ఆడియో సీడీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-తెనాలిరూరల్
కనపర్తి రత్నాకర్ దర్శకత్వం వహిస్తున్న 'శిశిరం' చిత్రం ఆడియో సీడీని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజరు శ్రీనివాస్ నాయక్ ఆవిష్కరించారు. బుధవారం విజయవాడ ఎఫ్‌డీసీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో సినీ నిర్మాణాలను ఎఫ్‌డీసీ ప్రోత్సహిస్తోందన్నారు. చిత్ర నిర్మాణం పూర్తి చేసుకున్న సినిమాలకు రూ.10 లక్షలు రాయితీ అందించి నిర్మాణాలను సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. సింగిల్ విండో పద్ధతిలో బ్యానర్, టైటిల్, లొకేషన్ల అనుమతులు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఔత్సాహిక నిర్మాతలు, దర్శకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిశిరం చిత్ర బృందానికి అభినందనలు తెలియజేశారు. అనంతరం దర్శకుడు రత్నాకర్, పాటల రచయిత సురేంద్ర రొద్ద మాట్లాడారు. సంగీత దర్శకుడు శాండి అద్భుతమైన సంగీతం అందించారన్నారు.



ఆర్థిక క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - తుళ్లూరు
ప్రతి వ్యక్తీ ఆర్థిక క్రమశిక్షణ కలిగి, సంపాదనలో 20 శాతం తప్పకుండా పొదుపు చేయాలన్నది భారతీయ రిజర్వు బ్యాంకు ముఖ్య ఉద్దేశమని ల్యాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మన్‌పాల్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం ఆవరణలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య అవగాహన సదస్సుపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడి, పలు అంశాలపై వివరించారు. వెలుగు సంస్థ ఏపీఎం కె.చినవీరయ్య మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడూ లక్షాధికారి కావాలని.. ప్రభుత్వ బ్యాంకులో మాత్రమే డబ్బుకు భద్రత ఉంటుందని చెప్పారు. డిజిటల్ లావాదేవీలు జరిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుళ్లూరు బరోడా బ్యాంకు జాయింట్ మేనేజర్ ప్రసాద్, ల్యాంప్ సంస్థ రిసోర్స్ పర్సన్ కె.వెంకటేశ్వర్లురావు, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.



టెక్నాలజీతో సవాళ్లూ అధికమే..

ప్రజాశక్తి - తుళ్లూరు
రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, ఐఈఈఈ కంప్యూటేషనల్ ఇంటెలిజెన్స్ సొసైటీ (హైదరాబాద్) చాప్టర్ సంయుక్త ఆధ్వర్యంలో "డీప్ ఫేక్ టూల్స్, టెక్నిక్స్, ఎథికల్ ఇంప్లికేషన్స్" అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది ఔత్సాహికులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ మహంతి మాట్లాడుతూ డీప్ ఫేక్ టెక్నాలజీలో అభివృద్ధి, ఎదురవుతున్న సవాళ్లు, అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సచి నందన్ మహంతి, డాక్టర్ దీప్తి గోడవర్తి, డాక్టర్ సుధాకర్ ఇలాంగో, సరోజ్ కుమార్ పాణిగ్రాహి తదితరులు పాల్గొన్నారు.

'నమో అదాని.. కరెంటు కహాని' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తాడేపల్లి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ ఒప్పందాల్లో వేలాది కోట్ల రూపాయలు కొల్లగొట్టిన బడా పెట్టుబడి దారుడు ఆదానికి ప్రధానమంత్రి మోడీ కొమ్ముగాయటం పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు అభ్యంతరం వ్యక్తం చేశారు. బుధవారం తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ తీసుకొచ్చిన 'నమో అదాని..కరెంటు కహాని' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఆదాని అవినీతిలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మిలాకత్ అయితే, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుషిమాత్ అయ్యారని ఎద్దేవా చేశారు. ఆదానీ నీకుంభకోణం పై దేశ విదేశాలో ప్రభుత్వాలు స్పందిస్తున్న రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీన్నిబట్టి ప్రభుత్వాలు మారిన విధానాలు ఒకటేనని స్పష్టమవుతుందని చెప్పారు. ఆదానితీసుకొస్తున్న స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసుకున్న ఒప్పందాల్లో భాగ ంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.1850 కోట్లు ప్రజలపై భారం వేయడాన్ని నిరసించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, కొట్టే కరుణాకర్ రావు, ఎస్ గిరిజ, శ్రీనివాసరెడ్డి, కే బాబురావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

విజయానికి కృషి, పట్టుదలే సోపానాలు

పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు

విజయానికి పట్టుదల, కృషి తప్ప షార్ట్‌కట్‌లు ఉండవని, కావున విద్యార్థి దశ నుండే ప్రణాళికాబద్ధంగా లక్ష్య సాధన కోసం కృషి చేయటం అలవాటు చేసుకోవాలని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. బుధవారం స్థానిక గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌ను కమిషనర్ పాల్గొని ప్రారంభించారు. తొలుత క్రీడాకారుల నుండి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ, క్రీడా పతాకాలను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షతన జరిగిన సభలో కమిషనర్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు పట్టుదల, ప్రణాళిక, కృషి తప్ప షార్ట్ కట్‌లు ఉండవని స్పష్టం చేశారు. క్రీడల్లో గెలుపోటముల్ని సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు మాట్లాడుతూ క్రీడలు ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రస్తుతం కార్పొరేట్ విద్యా విధానంలో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నాయన్నారు. బాలికలకు డిస్ట్రిక్ట్ స్థాయిలో స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు ద్వారా వారి ప్రతిభకు వేదిక కల్పించటం అభినందనీయం అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషారాణి మాట్లాడుతూ 1968లో ఏర్పడిన మహిళా పాలిటెక్నిక్ కళాశాల నిష్ణాతులైన అధ్యాపకుల ద్వారా బాలికలను చదువుతోపాటు, క్రీడల్లోనూ ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్‌కు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నగర కమిషనర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కళాశాల అభివద్ధికి రూ.20వేలు చొప్పున విరాళం అందచేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌మీట్ జిల్లా నోడల్ ఆఫీసర్, ఎంబిటిఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి ప్రిన్సిపాల్ టి.శేఖర్, గవర్నమెంట్ టెక్స్టైల్ కాలేజి ప్రిన్సిపాల్ శైలజ, అధ్యాపకులు, పిడిలు పాల్గొన్నారు.

హిందూ ఇంజనీరింగ్ కాలేజీలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలేజి సెక్రెటరీ రామకృష్ణమూర్తి తదితరులు

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఈనెల 20, 21 తేదీల్లో 'ఆదర్శ్ 2024' పేరుతో రాష్ట్రస్థాయి అంతర్ ఇంజినీరింగ్ కళాశాలల క్రీడా పోటీలు పెద్ద ఎత్తున నిర్వ హిస్తు న్నట్లు కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి తెలియజేశారు. బుధవారం కళాశాల సమావేశ మందిరంలో పోటీలకు సంబంధించిన పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెక్రెటరీ రామకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థినీ, విద్యార్థులు వారిలోని క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించుకునే అవకాశం కలుగుతుందన్నారు. వారిలో శారీరక , మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. దాని వలన చదువులో ఏకాగ్రతతో వారు ఎంచుకున్న లక్ష్యాలు సాధించగలరన్నారు. క్రీడా పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తు న్నామన్నారు. 20వ తేదీ క్రీడలను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక విభాగం కమిషన్ చైర్‌పర్సన్ పోడపాటి తేజస్విని ప్రారంభిస్తారన్నారు. 21వ తారీకున జరిగే బహుమతి ప్రధానోత్సవానికి కేంద్రమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గుంటూరు పశ్చిమ శాసన సభ్యురాలు గల్లా మాధవి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. గోడప్రతుల ఆవిష్కరణ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి ఐజక్ ప్రసాద్,వైస్ ప్రిన్సిపల్ వజ్రాల నర్సిరెడ్డి, క్రీడోత్సవాల సమన్వయకర్త డాక్టర్ కె వి ఎస్ దుర్గాప్రసాద్, సాంస్కృతిక విభాగాల సమన్వయకర్త కొల్లా సుస్మిత చౌదరి,కృష్ణార్జునరావు ఫిజికల్ డైరెక్టర్ క్రోసూరు రవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంతాల రీ సర్వే సక్రమంగా నిర్వహించాలి : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు


మాట్లాడుతున్న కలెక్టర్

గ్రామాల్లో స్వామిత్ర ద్వారా నిర్వహిస్తున్న గ్రామ కంతాల రీసర్వే నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించేలా నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పంచాయితీ, సర్వే అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవతేజతో కలసి గ్రామాలలో స్వామిత్ర ద్వారా జరుగుతున్న గ్రామ కంతాల రీసర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 328 గ్రామాల్లో ఇప్పటికే 16 రెవెన్యూ గ్రామాల్లోని గ్రామ కంతాల రీసర్వే పూర్తి అయ్యిందని, 50 గ్రామాలకు సంబంధించి మ్యాప్‌లు వచ్చినందున గ్రామ కంతాల రీసర్వేకు సంబంధించి ఇతర ప్రక్రియలు వెంటనే ప్రారంభించాలన్నారు. రీసర్వే జరిగే గ్రామాల వారీగా పంచాయితీ, సర్వే, రెవెన్యూ, సచివాలయ ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేకంగా బృందాలను నియమించి, మరోసారి శిక్షణ అందించాలన్నారు. రీసర్వే ప్రక్రియలకు దశలవారీగా లక్ష్యాలను నిర్దేశించి వాటిని అధిగమించేలా మండల , డివిజన్ , జిల్లా స్థాయి అధికారులు నిరంతర పర్యవేక్షిస్తూ అవసరమైన సూచనలు అందించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సిఇఒ జ్యోతిబసు, డీపీఓ నాగసాయికుమార్, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, జిల్లా సర్వేయర్ పవన్‌కుమార్, ఎన్ఐసీ అధికారి బిమల్‌కుమార్ పాల్గొన్నారు.

శంకర్ విలాస్ బ్రిడ్జి పనులపై కమిషనర్ సమీక్ష


మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని శంకర్‌విలాస్ ఆర్‌ఓబి నిర్మాణంకు సంబంధించిన క్షేత్రస్థాయి పనులను ఆర్‌అండ్‌బి, నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో వేగంగా చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం నగరపాలకసంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో ఆర్ అండ్ బి, జిఎంసి పట్టణ ప్రణాళిక అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి ఎదురు చూస్తున్న శంకర్ విలాస్ ఆర్‌ఓబికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆమోదం తెలిపినందున నిర్మాణం కోసం రోడ్ విస్తరణ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే అరండల్ పేట, బ్రాడిపేట వైపు ప్రభావిత భవనాల యజమానులతో, ఏఈఎల్‌సి చర్చి, ఆర్సీఎం చర్చి ప్రతినిధులుతో సమావేశం జరిపి వారి నుండి సలహాలు, సూచనలు తీసుకున్నామని తెలిపారు.ఆర్‌ఓబి నిర్మాణం, సర్వీస్‌రోడ్ మార్కింగ్ వంటి పనులను వేగంగా చేపట్టాలన్నారు.ఆర్‌ఓబి నిర్మాణ పనులు ప్రారంభించిన అనంతరం నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ పోలీస్, రైల్వే అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని, అవసరమైతే జాయింట్ మీటింగ్‌లు ఏర్పాటు చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు.సమావేశంలో సిటి ప్లానర్ రాంబాబు, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ ఆర్.శ్రీనివాసమూర్తి, ఈఈ సి.విశ్వనాధరెడ్డి, డిఈఈ చిన్నయ్య, ఏసిపి రెహ్మాన్ పాల్గొన్నారు.

హిందూ ఫార్మసీలో తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కాలేజిలో బి.ఫార్మసీ, ఫార్మ్.డి మొదటి సంవత్సరం తరగతులు బుధవారం ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలియజేశారు. సమావేశానికి కళాశాల ఛైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రారంభం నుండి నేటి వరకూ సాధించిన విజయాలను వివరించారు. విద్యార్థులు తాము ఎంచుకున్న రంగంలో ఉన్నత శిఖరాలు అందుకోవటానికి క్రమశిక్షణతో విద్యని అభ్యసించాలని అన్నారు. కళాశాల గౌరవ ఛైర్మన్ డాక్టర్ మన్నవ రాధాకష్ణమూర్తి మాట్లాడుతూ ఫార్మసీ నిపుణులకు ఇండస్ట్రియల్ ఫార్మసీ, క్లినికల్ రీసెర్చ్, కమ్యూనిటీ ఫార్మసీలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. దేశంలో ఫార్మసీ కళాశాలల స్థాపనకు కృషి చేసిన డాక్టర్ మహాదేవలాల్ ష్రాఫ్, డాక్టర్ మదన్ మోహన్ మాలవియలను, ఔషధ రంగంలో పరిశోధనలు చేసి ఎటరధాన్, ఫోలిక్ యాసిడ్, టెట్రా సైక్లిన్ లాంటి ఔషధాలను కనుగొన్న డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు జీవిత చరిత్రలను తెలుసుకొని స్ఫూర్తి పొందాలని అన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జవహర్‌బాబు, కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదన రావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, ఫార్మ్.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

21,22 తేదీల్లో వివిఐటిలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

వివిఐటి కాలేజిలో డిసెంబర్ 21, 22 తేదీల్లో జాతీయ స్థాయి యువజనోత్సవం ' వివా వివిఐటి 2కె2024' నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. వసుదైక కుటుంబాన్ని ప్రతిబింబించేలా భూమిపై అన్ని జీవరాసులూ ఒకే కుటుంబం అనే ఆలోచన చాటేలా ' ది వరల్డ్ ఈజ్ వన్' నేపథ్యంలో ఈ యువజనోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ (శాక్) ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో సాంకేతిక, క్రీడా, సాంకేతిక విభాగాల్లో 93 అంశాల్లో పోటీలు ఉంటాయని వివరించారు. అలాగే 23వ తేదీన కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. వివిఐటి కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు మాట్లాడుతూ యువజనోత్సవాలలో పాల్గొనే విద్యార్థులు 'వివావివిఐటి.కామ్' వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. పాల్గొనే వారి కోసం గుంటూరు, విజయవాడ, తెనాలి ప్రాంతాల నుండి రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో శాక్ విద్యార్థి సోమదినేష్, తదితరులు పాల్గొన్నారు.

టిజెపిఎస్‌లో ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు: స్థానిక టిజెపిఎస్ కాలేజిలో డిసెంబర్ 21, 22 తేదీలలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల ఖో-ఖో (పురుషుల) పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.శివాజీ తెలిపారు. పోటీల అనంతరం యూనివర్సిటీ ఖోఖో జట్టు ఎంపిక కూడా ఉంటుందన్నారు. ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ పరిధిలో ఉన్న కళాశాలల జట్లు ఈపోటీలలో పాల్గొనవచ్చని, క్రీడాకారులు వచ్చేటప్పుడు తప్పని సరిగా అర్హత ఫారాలు, సంబంధిత సర్టిఫికెట్లు తీసుకురావాలని చెప్పారు. ఈ పోటీలలో పాల్గొనే కళాశాలల జట్ల వివరాలను 9849703144, 9849854221 నంబర్లుకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

యూసీమాస్ పోటీల్లో సత్తా చాటిన నగర విద్యార్థులు

ప్రజాశక్తి-గుంటూరు

యూసీమాస్- 2024 పేరుతో ఈనెల 14, 15 తేదీలలో న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచస్థాయి అతిపెద్ద అబాకస్, మెంటల్ అర్థమెటిక్ ఈవెంట్లలో నగరంలోని చంద్రమౌళి నగర్, నగరాలు, సంగడిగుంట శాఖల యూసీమాస్ విద్యార్థులు సత్తా చాటారని యూసీమాస్ ఆంధ్రప్రదేశ్ మాస్టర్ ఫ్రాంచైజీ, శ్రీరెయినా టెక్నాలజీస్ చైర్మన్ ఎన్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా చంద్రమౌళి నగర్ శాఖలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఏపీచైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 30 దేశాల నుండి ఆరు వేల మంది విద్యార్థులు పోటీలో పాల్గొనగా గుంటూరు నగరానికి చెందిన వందేష్ కేవలం ఎనిమిది నిమిషాలలో 200 సమ్స్‌ను పరిష్కరించి ఛాంపియన్‌షిప్‌గా నిలిచాడని తెలిపారు. గగన రెండవ రన్నర్‌అప్, ఆర్థయ, కుందన, భవ్య, చంద్రిక, దేవాన్ష్, పర్ణిత, రేహశ్రీ మూడవ రన్నరప్‌లు సాధించారన్నారు. కార్యక్రమంలో శ్రీరేయినా టెక్నాలజీస్ ప్రతినిధులు శ్రీకాంత్, రమ, నందిని, రోషిని, కోమలి, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి తదితరులు